
సాక్షి వికారాబాద్

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023


రైతు సోదరులకు విజ్ఞప్తి

రైతలకు తెలియచేయడము ఏమనగా కేంద్రం ఆదేశానుసారం 02 - జనవరి - 2024 నుండి పత్తి రకమ MECH కు మార్చడము జరుగుతుంది.

కావున రైతులు ఈ విషయాన్ని గమనించగలరు అని

మద్దతు ధరకు మంగళం

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర తగ్గించిన్లు ధారూరు వ్యవసాయ మార్కెట్ అధికారులు ప్రకటించారు.

10లో▸



గాడి తప్పింది

పాఠశాలల అభివద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం. ఈ కమిటీ ఆమోదంతోనే అభివృద్ధి పనులు నిర్వహిస్తారు.

10లో▸



భక్తిశ్రద్ధలతో పడిపూజ

మున్సిపల్ కేంద్రంలోని వడ్డర్‌గల్లీ దిత్తార్ పెరుమాళ్ల దేవస్థానం ఆవరణలో అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు.

11లో▸

న్యూస్‌రీల్

రేపు వాహన విడి భాగాలకు వేలం

అనంతగిరి: జిల్లా పోలీసు వాహనాలకు ఉపయోగించిన విడి భాగాలకు ఈ నెల 30న వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ఎస్పీ కార్యాలయం ఆవరణలో వేలం ఉంటుందని తెలిపారు. వాహనాల టైర్లు, ట్యూబ్‌లు, బ్యాటరీలు ఇతర విడి భాగాలు, వాడిన ఇంజన్ ఆయిల్‌కు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొన వచ్చని ఎస్పీ కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కమ్మదనం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా జనవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభా కళాశాలలో ఐఐటీ, జేఈఈ, నీట్, సీఏంఏ, క్లాట్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 1800 425 45678 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెట్రోల్‌ను విడిగా విక్రయించొద్దు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పెట్రోల్‌ను బాటిళ్లలో విక్రయించడం నిబంధనలకు వ్యతిరేకం అని, ప్రమాదానికి హేతువని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఇమామ్ గూడలోని పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్‌ల అనుమతులను కాల పరిమితి ముగిసేలోపే పునరుద్ధరణకు చర్యలు తీసుకోవటం మేలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విడిగా అమ్మడం చేయరాదన్నారు. అనంతరం తూనికలు కొలతల శాఖ, కేంద్ర ప్రభుత్వ అనుమతి పత్రాలను పరిశీలించారు.

'సే నో టు డ్రగ్స్' షురూ..



బండ్లగూడ: మాదకద్రవ్యాలపై జంగ్ షురూ చేసిన నగర పోలీసు విభాగం అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. ఓపక్క డ్రగ్స్ తయారీ, సరఫరా, విక్రయం, వినియోగంపై ఉక్కుపాదం మోపుతూనే యువతలో అవగాహన పెంచడానికీ పెద్ద పీట వేస్తున్నారు. దీనికోసం ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే నగర శివార్లలోని షాదాన్ కళాశాలలో జరుగుతున్న పల్సేషన్–2023 కార్యక్రమానికి గురువారం హాజరైన నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి 'సే నో టు డ్రగ్స్' క్యాంపెయినింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల నుంచి అప్పా జంక్షన్ వరకు జరిగిన 2కే రన్‌లో పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. ఇందులో వివిధ కళాశాలలకు చెందిన 2 వేల మంది మెడిసిన్ విద్యార్థులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. పల్సేషన్–2023లో భాగంగా అంతర్ కళాశాలల కల్చరల్, లిటరరీ, స్పోర్ట్స్, ఫుడ్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి.

నిమ్స్‌లో వెయ్యి మార్క్ దాటిన వ్యాస్కులర్ సర్జరీలు



లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) చరిత్రలో మొదటిసారిగా వ్యాస్కులర్ సర్జరీ విభాగం శస్త్రచికిత్సల్లో వెయ్యి మార్క్ దాటి తన ఉనికిని చాటుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి గురువారం వరకు ఫిస్టులా ఆర్టెరియోవెనస్ సర్జరీలు జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వ్యాస్కులర్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో సెలబ్రేట్ చేసుకున్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప కేక్ కట్ చేశారు. ఈ సర్జరీలో పాల్గొన్నటువంటి వైద్యులను, హెల్త్ కేర్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరురూరల్: పర్వతాపూర్‌లో మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

దరఖాస్తుల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి జిల్లాలో అనూహ్య స్పందన వచ్చింది. గురువారం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభలకు జనం భారీగా తరలివచ్చి ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు ఫారాలు అందజేశారు. ఉదయం నుంచే కేంద్రాలకు జనం తరలివచ్చారు. మహిళల కోసం అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు.



పూడూరులో దరఖాస్తు తీసుకొని రసీదు ఇస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

'గండీడ్' మాకొద్దు

- ఆ మండలాన్ని జిల్లాలో కలపొద్దంటూ నిరుద్యోగుల నిరసనలు
- విలీనం చేస్తే నష్టపోతామని ఆవేదన

వికారాబాద్ అర్బన్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆయా జిల్లాల్లోని కొన్ని మండలాల మార్పులు, చేర్పులు జరుగుతాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న గండీడ్ మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలుపుతారనే ప్రచారం సాగుతోంది. ఇదే నిజమైతే తమకు తీరని అన్యాయం జరుగుతుందని జిల్లాకు చెందిన నిరుద్యోగులు అంటున్నారు. కొన్ని రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండీడ్ మండలాన్ని ఎట్టి పరిస్థితుల్లో జిల్లాలో కలపరాదని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. గండీడ్ ప్రాంతం వారు తప్పుడు మార్గంలో వెళ్లి ప్రభుత్వ ఉద్యోగాలను తెచ్చుకుంటున్నారనే ప్రచారం చాలా రోజులుగా ఉంది. పైగా గత ఏడాది రాష్ట్ర స్థాయిలో సంచలనం రేపిన గ్రూప్ – 1, గ్రూప్ –2 వంటి పేపర్ల లీకేజీ వ్యవహారంలో ఈ మండలానికి చెందిన వ్యక్తులే ప్రధాన సూత్రధారులుగా ఉండటం జిల్లా నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. అత్యంత వెనుకబడి ఉన్న వికారాబాద్ జిల్లాలో ఇప్పటికే నిరుద్యోగం తాండవిస్తోందని, గండీడ్ మండలాన్ని విలీనం చేస్తే మరింత నష్టపోతామని వాపోతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన అనేక నోటిఫికేషన్లలో అమలు చేసిన రిజర్వేషన్ల కారణంగా అత్యధిక మార్కులు సాధించినా ఉద్యోగం పొందలేక పోయామని అంటున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మేలు జరుగుతుందని అనుకుంటున్న తరుణంలో గండీడ్ మండలాన్ని కలుపుతామనడం నిరుద్యోగుల జీవితాలతో చలగాటం ఆడడమేనని అంటున్నారు. ఆ మండలాన్ని ఎట్టి పరిస్థితిలో వికారాబాద్ జిల్లాలో కలపరాదని కోరుతున్నారు. త్వరలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



గండీడ్ మండలాన్ని జిల్లాలో కలపొద్దంటూ అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు

ఇప్పటికే నష్టపోయాం



గత ప్రభుత్వం అవలంబించిన రిజర్వేషన్ల విధానంతో ఎంతో నష్టపోయాం. గ్రూప్ –1, గ్రూప్ –2 పరీక్షలు రెండు సార్లు రాయాల్సి వచ్చింది. జిల్లాలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. అలాంటప్పుడు అదనంగా గండీడ్ మండలాన్ని తీసుకొచ్చి కలిపితే నిరుద్యోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

– శ్రీనివాస్ గంగారం, గ్రూప్ –2 అభ్యర్థి

గతంలో ఏం జరిగిందో తెలుసు



గతంలో జరిగిన పేపర్ లీకేజీల వ్యవహారం మూలాలు ఎక్కడ ఉన్నాయో అందరికి తెలుసు. గండీడ్ మండలాన్ని కాకుండా వికారాబాద్ జిల్లాకు దగ్గరలో ఉన్న శంకర్‌పల్లి, చేవెళ్ల వంటి మండలాలను కలిపితే ఎలాంటి నష్టం లేదు. పరిపాలన పరంగా కూడా ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలి

– మహ్మద్ అల్తాఫ్, బీఈడీ అభ్యర్థి



రాజాపూర్ ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గ్యారంటీల అమలుకే 'ప్రజాపాలన'

- అర్హులు దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

ధారూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసమే ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రాజాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ సభల నిర్వాహణ కోసం జిల్లా వ్యాప్తంగా 57 టీంలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జనవరి 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రసీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముందుగా కలెక్టర్ ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సుజాత, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఆర్డీఓ విజయకుమారి, డీఎస్పీ నర్సింహులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చెన్నారెడ్డి, తహసీల్దార్ భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల: వాహనదారులు లోక్ అదాలత్‌లను ఉపయోగించుకొని పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ కేసులను పరిష్కరించుకోవాలని రిటైర్డు జడ్జి సాంబశివరావు సూచించారు. మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులకోసం నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్ గురువారం నాలుగో రోజు కొనసాగింది. ఇందులో మద్యం తాగి వాహనాలు నడిపిన 105 కేసులు పరిష్కారమైనట్టు సాంబశివరావు తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.1,34,500 జరిమానాలు విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, కోర్టు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివరావు

రాజకీయ షడ్రుచులు

- గులాబీ నేతలకు చుక్కెదురు
- ఏడాదంతా గిల్లికజ్జాలే..
- రెబల్ పాత్రలో మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి
- ప్రతికూలంలోనూ క్యాడర్‌ను కాపాడుకున్న కాంగ్రెస్
- నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ హస్తం హవా
- ప్రభావం చూపని బీజేపీ.. పట్టుకోల్పోయిన వామపక్షాలు





వికారాబాద్: ఈ ఏడాది చివరి దాకా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు హడావుడి చేయడం తప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేదనే విమర్శలు మూటగట్టుకున్నారు. అదిగో నిధులు.. ఇదిగో ప్రొసీడింగులంటూ హల్‌చల్ చేశారు. ఎన్నికల ముందు వందల కోట్ల నిధులంటూ ఊదరగొట్టిన బీఆర్ఎస్ నేతలు వాటిని పనుల వరకు తీసుకెళ్లడంలో విఫలమయ్యారనే విమర్శలు ఎదుర్కోక తప్పలేదు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నా ఆయా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి అంతంత మాత్రమే అని చెప్పవచ్చు. నెల రోజుల క్రితం వరకు అధికారంలో ఉన్న ఆ పార్టీ నేతల్లో సమన్వయం లోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. మాజీ ఎమ్మెల్యేలు వర్సస్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్న విధంగా సాగింది. మాజీ మంత్రి ఏసీఆర్ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడం, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. క్యాడర్‌లో జోష్ నింపడంలో కూడా విఫలమయ్యారు. జిల్లాలో క్యాడర్‌ను కాపాడుకోవడంలో కాంగ్రెస్ పార్టీ సక్సెస్ అయ్యింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. వామపక్షాలు బీఆర్ఎస్‌తో జతకట్టడంతో ప్రజల పక్షాన పోరాటాలు చేయలేకపోయాయి. వామపక్ష అనుబంధ సంఘాలు అడపాదడపా పోరాటాలు చేసినా పెద్దగా ఒరిగిందేమీ లేదనే చెప్పొచ్చు. జిల్లా ప్రజలు 2023 సంవత్సరంతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డిలకు బైబై చెప్పి కొత్త సంవత్సరం 2024తోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలకు స్వాగతం పలికారు.

బీఆర్ఎస్ నేతల్లో కొరవడిన సఖ్యత

ఏడాదంతా బీఆర్ఎస్ పార్టీలో సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, రాష్ట్ర విద్యా మౌలిక వసరుల కల్పన సంస్థ మాజీ చైర్మన్, బీసీ కమిషన్ సభ్యుడు, తదితర ముఖ్య నేతలు ఉన్నా చాలా విషయాల్లో వీరి మధ్య సయోధ్య లేకుండానే ఏడాదంతా గడిపేశారు. ఆరని రావణ కాష్టంలా ఏడాది పొడవునా తాండూరులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల మధ్య వర్గ పోరు సాగింది. మహేందర్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్సీ పదవి దక్కించుకోవడం తోపాటు తాండూరులో పట్టు కోల్పోకుండా ఉండేందుకు శత విధాలా శ్రమించాల్సి వచ్చింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తర్వాత కారెక్కడంతో ప్రారంభమైన వర్గపోరు.. 2023 చివరి దాకా సాగింది. మర్పల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కాన్వాయ్‌పై దాడి ఘటనలో వికారాబాద్ బీఆర్ఎస్ నేతలు ఉన్నారన్న అనుమానంతో క్యాడర్ రెండుగా చీలిపోయింది. ఈ ఏడాది జిల్లాలో నేతల వలసలు ఏకపక్షంగా సాగాయి. బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి క్యూ కట్టారు. వారిని ఆపడానికి కారు పార్టీ నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గులాబీ నేతలు పార్టీని బలోపేతం చేయడం పక్కన పెట్టి తమ తమ వర్గాలను కాపాడుకోవటానికే ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న పరిణామాలు, గొడవలు జుగుప్సాకరంగా మారాయి. ఈ ఏడాది చివరలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కకపోవడం బట్టి చూస్తే ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో ఇట్టే అర్థమైపోతుంది. ఎన్నికలకు ముందు పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవితో, రోహిత్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ కేటాయింపుతో బీఆర్ఎస్ అధిష్టానం సమన్యాయం చేసినట్లు అనిపించినా.? మహేందర్‌రెడ్డి ఒక్క క్యాబినెట్ సమావేశానికి కూడా హాజరు కాకుండానే పదవిని కోల్పోగా.. రోహిత్‌రెడ్డి పరాజయాన్ని చవిచూశారు.

సమూల మార్పుతో ముగింపు

2023లో కాంగ్రెస్ తన క్యాడర్‌ను కాపాడుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో సఫలమైందనే చెప్పాలి. ఈ ఏడాది మొత్తం ఎక్కడా.. ఏ చిన్న పొరపాటు జరిగినా వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగింది. అధిష్టానం పిలుపు మేరకు జిల్లా నాయకత్వం ప్రజల్లోకి చొచ్చుకెళ్లింది. ప్రజా సమస్యలు, ధరణి, రైతు సమస్యలతోపాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ముందుకు సాగారు. బీఆర్ఎస్‌కు జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్, మెజార్టీ మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఉన్నా ఆ పార్టీ తమ క్యాడర్‌ను కాపాడుకోలేక పోయింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అన్ని స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి కొత్త సంవత్సరంతో పాటు కొత్త ప్రభుత్వానికి నాంది పలికారు.

ఆత్మజ్ఞానం తెలుసుకున్నవారే ధ్యానులు



ప్రసంగిస్తున్న పరిమళపత్రి

- పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి

కడ్తాల్: ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకున్నవారే ధ్యానులని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ గ్లోబల్‌ఫౌండర్ పరిమళపత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ క్షేత్రంలో జరుగుతున్న ప్రత్రీజీ ధ్యాన మహాయాగం గురువారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ధ్యానులను ఉద్దేశించి పరిమళ పత్రి సందేశమిచ్చారు. భూమి మీద విశ్వనియమాలు సకల ప్రాణకోటికి ఒక్కటేనని తెలిపారు. మహేశ్వర మహాపిరమిడ్ శక్తిస్థల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఆధ్యాత్మికతతో సరైన మిత్రుత్వం లభిస్తుందన్నారు. ధ్యానం ఎంతో విశిష్టమైనదని, నిత్యం ధ్యాన సాధన చేయాలని సూచించారు. శరీరం, మనస్సు, బుద్ధి, శ్వాస ఏకం కావడమే ధ్యానమన్నారు. ధ్యానం చేయడం ద్వారా శరీరం, మనస్సు, బుద్ధి, ఆత్మ అన్ని బాగుపడుతాయని తెలిపారు. పీఎస్ఎస్ఎం భాగ్యనగర్ ట్రస్టీ లక్ష్మి మాట్లాడుతూ.. ప్రత్రీజీ ఎన్నో అద్భుతాలు సృష్టించారని, అందులో ఒక అద్భుతం పిరమిడ్ పార్టీ అని తెలిపారు. పిరమిడ్ కేంద్రం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందన్నారు. ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్రీజీ శక్తిస్థల్ ప్రాజెక్టుకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని పిలుపునిచ్చారు. పరిణీత పత్రి మాట్లాడుతూ.. శాఖాహార జగత్తుకు కృషి చేయాలని కోరారు. వేడుకల్లో నందూరి శ్రీనివాస్ ప్రవచనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పిరమిడ్ సందర్శనకు వేలాదిగా వచ్చిన ధ్యానులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ దాట్ల హన్మంతరాజు, కిషన్‌రెడ్డి, శివప్రసాద్, రాయజగపతిరాజు, బాలకృష్ణ, నవకాంత్, ఆనంద్, విజయలక్ష్మి, వాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనవరి 17లోగా ఫీజులు చెల్లించాలి

బీఆర్‌ఏఓయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజారాం

కొడంగల్ రూరల్: బీఆర్‌ఏఓయూ (బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ)లో డిగ్రీ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులతో పాటుగా మూడు, నాలుగు సెమిస్టర్ విద్యార్థులు జనవరి 17లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని కళాశాల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.రాజారాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.500 అపరాధ రుసుముతో జనవరి 23వరకు అవకాశం ఉందని చెప్పారు.

కృష్ణంరాజుకు డాక్టరేట్



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గౌతంరాజు

కొడంగల్: పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజుకు గౌరవ డాక్టరేట్‌ను గురువారం ప్రదానం చేశారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ సాహిత్య కళాసేవా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఇందిర అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సినీ నటుడు డాక్టర్ గౌతంరాజు హాజరయ్యారు. బైబిల్ వర్సిటీ ఆధ్వర్యంలో గౌతంరాజు చేతుల మీదుగా కృష్ణంరాజుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

న్యూ ఇయర్ ఈవెంట్స్‌కు అనుమతులు తప్పనిసరి

సీఐ శ్రీను

అనంతగిరి: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా అనుమతులు లేకుండా రిసార్ట్స్‌లో ఈవెంట్స్ నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీను హెచ్చరించారు. అనుమతులు పొందినవారు తప్పకుండా సూచనలు పాటించాలన్నారు. డ్రగ్స్, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని సూచించారు. అర్ధరాత్రి ఒంటి గంటలోగా వేడుకలు ముగించాలన్నారు. డీజే సౌండ్స్ 45 డెసిబుల్స్ మించరాదని సూచించారు. అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవన్నారు. ప్రతీ ఈవెంట్‌లో సీసీ కెమెరా, సెక్యూరిటీ తప్పనిసరి అన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకూడదన్నారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుపడితే రూ.10వేల జరిమానాతో పాటు జైలు శిక్ష, లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

హెల్త్ సూపర్‌వైజర్ అమరేశ్వరి

మర్పల్లి: అభయహస్తం ప్రజాపాలన గ్రామ సభల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు వినియోగించుకోవాలని పట్లూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అమరేశ్వరి కోరారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు గ్రామాలలో నిర్వహించే అభయహస్తం ప్రజా పానలలో గ్రామసభల్లో ప్రతీ రోజు హెల్త్ క్యాంపు ఉంటుందని చెప్పారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటుగా అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టండి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

షాబాద్: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటప్ప కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సభ్యత్వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనంన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన విద్యారంగాన్ని కొత్త ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా సాధారణ బదిలీలు సైతం లేవన్నారు. ఇటీవల జరిగినా అవి అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, మండల అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్ తదితరులున్నారు.

గడువు ముగిసింది.. గాడి తప్పింది

- నాలుగేళ్లుగా ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా
- ఈనెల 31తో ముగియనున్న కాలపరిమితి
- పాతకమిటీలతోనే నెట్టుకొస్తున్న వైనం



గోకఫసల్‌వాడ్ ప్రాథమిక పాఠశాల

దౌల్తాబాద్: పాఠశాల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)ల పాత్ర కీలకం. ఈ కమిటీ ఆమోదంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు, కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కమిటీ గడువు ఇటీవలే ముగిసింది. మరో నెల పాటు పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలు ప్రారంభమైన వెంటనే పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలి. పాఠశాలల్లో మన ఊరు–మనబడి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనుల పర్యవేక్షణ బిల్లులు చెల్లింపు ఎస్‌ఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తే ఈ పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున మరోసారి పొడగించారు.


కమిటీ సభ్యుల పిల్లలు పైచదువులకు..

మండల వ్యాప్తంగా 42 ప్రాథమిక, ఎనిమిది ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 5వేల మందికి పైగా విద్యార్థులున్నారు. పిల్లల విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు తల్లిదండ్రులు విద్యాభిమానుల సహకారంతో ఎస్‌ఎంసీలను ఏర్పాటు చేశారు. 6–8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న ఉపాహారం మధ్యాహ్న భోజన నిర్వహణతో పాటు ప్రభుత్వం నుంచి పిల్లలకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు దుస్తులు, పాఠశాలకు వచ్చే నిధుల వివరాలు, మౌలిక వసతుల నిర్వహణపై ఎస్‌ఎంసీ కమిటీలను భాగస్వాములు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతీ నెలా ఎస్‌ఎంసీ సమవేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి వాటి అమలుకు కమిటీలు శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. కాగా గత నాలుగేళ్లగా పాత కమిటీలనే కొనసాగిస్తున్నారు. పలు పాఠశాలల్లో విద్యా కమిటీ సభ్యుల పిల్లలు పై చదువులకు వెళ్లిపోయారు. దీంతో ఆయా కమిటీల పర్యవేక్షణ పాఠశాలలపై లేకపోవడంతో ఎస్‌ఎంసీ కమిటీలు ఉన్నట్టా.. లేనట్టా..? అనే సందిగ్ధం నెలకొంది. నాలుగేళ్లుగా వాయిదా పడుతున్న ఎన్నికలను ఇకనైనా నిర్వహించి పాఠశాలల నిర్వహణ గాడిలో పడేలా చూడాలని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు.

మద్దతు ధరకు మంగళం

క్వింటాల్ పత్తికి రూ.100 తగ్గింపు

- జనవరి 2 నుంచి అమలు
- రైతులకు సందేశాలు
- కేంద్రంపై అన్నదాతల ఆగ్రహం



రైతు సోదరులకు విజ్ఞప్తి

రైతులకు తెలియచేయడము ఏమనగా కేంద్రం ఆదేశానుసారం 02 - జనవరి - 2024 నుండి పత్తి రకము MECH కు మార్చడము జరుగుతుంది.

కావున రైతులు ఈ విషయాన్ని గమనించగలరు అని మనవి.

పింజ రకము (MECH) ధర: 6920

ఏఎంసీ అధికారులు రైతులకు పంపిన సందేశం

ధారూరు: కేంద్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరను తగ్గించినట్లు ధారూరు వ్యవసాయ మార్కెట్ అధికారులు గురువారం ప్రకటించారు. ప్రస్తుతం క్వింటాల్‌కు పత్తికి రరూ.7,020 మద్దతు ధర ఉండ గా రూ.100 తగ్గింపుతో జనవరి 2 నుంచి రూ .6920 చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో రై తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తు తం విక్రయిస్తున్న పత్తికి తేమశాతం ఎక్కువగా ఉందని రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గిస్తున్నారని వి చారం వ్యక్తం చేశారు. ఎంఈసీహెచ్ పింజరకం క్వి ంటల్‌కు రూ.6,920గా నిర్ణయించినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. వర్షాకాలం సహకరించక, పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిందని, నష్టపోయిన రైతులకు మరింత చేయూత నివ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం రూ.100 తగ్గించడంపై మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారైందని రైతులు వాపోయారు. మూడేళ్లుగా ప్రైవేటు మిల్లర్లు పత్తి ధరను క్వింటాల్‌కు రూ. 11,000 నుంచి రూ.10,000, 8,000 తగ్గిస్తూ వచ్చారని, ఈ సంవత్సరం ఏకంగా రూ. 6,800లకు మొదట కొను గోలు చేసిన తర్వాత రూ. రూ. 6,500 వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని వారు పేర్కొన్నా రు. మద్దతు ధరను తగ్గించడం ఇదే మొదటి సారి చూస్తున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని భావిస్తే మద్దతు ధరను రూ.100 తగ్గించడం సరికాదన్నా రు. రైతుశ్రేయస్సు కోరే ప్రభుత్వమైతే రూ.200 మద్దతు ధర పెంచాలని కోరారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌సీఓ శారద

ఆర్‌సీఓ శారద

పరిగి: పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌సీఓ శారద అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రంగారెడ్డి పశ్చిమ గురుకుల పాఠశాలల భాషాపండితుల ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలు, పరీక్ష విధానం మొదలైన విషయాలను నిపుణులు వివరించారు. అనంతరం శారద మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పదోతరగతి ఫలితాలే కీలకమన్నారు. ఉపాధ్యాయు లు పదోతరగతి పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించా లని సూచించారు. ప్రత్యేక కార్యక్రమాలను రూ పొందించి ఉత్తమ ఫలితాలను తీసుకురావాలని కో రారు. ఇప్పటికే అన్ని గురుకులాల్లో విద్యార్థులకు అభ్యాసన దీపకలను అందజేశామని వాటిని విద్యార్థులు నిత్యం అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయుల కృషితోనే గురుకులాలకు మంచి పేరుప్రఖ్యాతలు వస్తాయన్నారు. ప్రతీ ఒక్క రు కష్టపడి పనిచేసి ఉత్తమ ఫలితాలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

యూటీఎఫ్ సంఘం జిల్లా కార్యదర్శి రాములు



పుట్టపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని సంఘం జిల్లా కార్యదర్శి రాములు, మండల అధ్యక్షకార్యదర్శులు రాము, రమేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పుట్టపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోరాటమే మార్గంగా యూటీఎఫ్ సంఘం ముందుకు సాగుతుందన్నారు. అవకాశవాద రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ విద్యావ్యవస్థ ఉన్నతికి ప్రభుత్వంతో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటేశ్, అజ్మత్, శంకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లు సరిచేయమంటే..

- కనెక్షన్ కట్ చేశారు
- డీఈ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధితుడు



కరెంటు బిల్లు చూపుతున్న బాధితుడు

తుర్కయంజాల్: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వచ్చిన అధిక బిల్లును తగ్గించమని దరఖాస్తు చేసుకున్నందుకు కనెక్షన్ కట్ చేశారు. దీంతో ఆగ్రహించిన బాధితుడు డీఈ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ ఘటన తుర్కయంజాల్‌లో గురువారం చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని పద్మావతి కాలనీలో అద్దెకు ఉంటున్న క్రాంతికిరణ్ ఇంటికి నవంబర్‌లో రూ.8500 బిల్లు ఇచ్చారు. దీంతో నేను వినియోగించిన దానికన్నా ఎక్కువగా వచ్చిందని.. బిల్లును సవరించాలని విద్యుత్ శాఖ సిబ్బందిని కోరాడు. వారు స్పందించ లేదు. తిరిగి డిసెంబర్‌లో మరో రూ.వేయితో కలిపి రూ.9504 బిల్లు వేశారు. దీంతో క్రాంతి కిరణ్ ఏడీఈ వినోద్ రెడ్డిని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి అధికంగా వచ్చిన బిల్లును తొలగించాలని, వాడిన రీడింగ్ ఆధారంగా బిల్లు చెల్లిస్తానని కోరాడు. అయినా సిబ్బంది పట్టించుకోకుండా గురువారం అతడి ఇంటి కరెంట్ కనెక్షన్‌ను తొలగించారు. పూర్తి బిల్లు కడితేనే పునరుద్ధరిస్తామన్నారు. దీంతో ఆయన చేసేదేమి లేక డీఈ కార్యాలయం ఎదుట బైఠాయించి ల్యాప్ టాప్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ విధులను నిర్వహించాడు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ 'సాక్షి'తో మాట్లాడుతూ అధికంగా వచ్చిన బిల్లును సరి చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా.. కనెక్షన్ కట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న అధికారులు క్రాంతి కిరణ్‌కు సర్దిచెప్పేందుకు యత్నించారు. అయినా వినకపోవడంతో విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు.

పని ఒత్తిడితో ఆలస్యం

బిల్లు అధికంగా వచ్చిందని 19న క్రాంతి కిరణ్ ఫిర్యాదు చేసినప్పటికీ పని ఒత్తిడి, సెలవుల కారణంగా సమస్య పరిష్కారం ఆలస్యమైంది. డీఈ కార్యాలయంలో ఇంటర్నెట్ సమస్య ఉన్నందున బిల్లు సరిచేయడం ఆలస్యమైంది. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం.

– వినోద్‌రెడ్డి, ఏడీఈ

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు గురుకుల విద్యార్థిని

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని హైమావతి ఎంపికైంది. గురువారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. ఐవీ రావు బాక్సింగ్ క్లబ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో 2023–24కు గాను అండర్–19 విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని హైమావతి బంగారు పతకం కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా హైమావతిని పశ్చిమ ప్రాంతీయ సమన్వాయాధికారి శారదావెంకటేశ్, స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్ రామ్‌లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.



మెడల్ చూపుతున్న హైమావతి

'ప్రజా పాలన'ను విజయవంతం చేయండి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: ప్రజా పాలనను అధికారులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి విజయవంతం చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యన్ని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చైతన్యనగర్, గొట్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత వైఎస్సార్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామాల్లో అర్హులకు పథకాలను అందించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రవేశపెట్టారని చెప్పారు. పట్టణాలకు వలస వెళ్లిన వారికి సైతం వెసులుబాటు కల్పిస్తామని.. తెల్ల కాగితంపై ఆర్జీ ఇచ్చిన పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వందరోజుల్లో ఆరు గ్యారెంటీ స్కీంలు అమలు చేస్తామన్నారు. ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, జిల్లా సంక్షేమ, మండల ప్రత్యేకాధికారి లలితకుమారి, వైస్ ఎంపీపీ మధులత, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, సీఐ రాంబాబు, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ రేణుక, ఏఓ నజీరుద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, ఎస్‌ఐ కాశీనాథ్, సర్పంచ్‌లు మాణెమ్మ, లలిత, పీహెచ్‌సీ డాక్టర్ బుచ్చిబాబు, విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు శోభారాణి, వివిధ గ్రామాల పంచాయతి కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్‌లు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



రాంసింగ్ మృతదేహం

బొంరాస్‌పేట: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని బుర్రితండాలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన రాంసింగ్(40) జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లేగదూడలపై కుక్కల దాడి



వీధికుక్కల దాడిలో గాయపడిన లేగదూడ

షాద్‌నగర్: లేగదూడలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటన మండల పరిధిలోని కడియాలకుంట తండాలో గురువారం వెలుగు చూసింది. తండాకు చెందిన మేఘావత్ నరేందర్ పాడి పశువులు, లేగదూడల పై బుధవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన పలువురు రైతులకు సంబంధించిన మేకలపై సైతం కుక్కలు దాడి చేయడంతో జీవాలు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముగ్గురికి గాయాలు

శంషాబాద్ రూరల్: బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందగా, అతని కుటుంబ సభ్యులకు గాయాలైన సంఘటన గురువారం మండల పరిధిలోని పాల్మాకుల శివారులో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొడంగల్ మండలం, నాగారం గ్రామానికి చెందిన గాండ్ల రాజు(38) భార్య సంధ్య, కుమార్తె కీర్తన, కుమారుడు కార్తీక్‌తో కలిసి బైక్‌పై ఇబ్రహీం పట్నం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గ మధ్యలో పాల్మాకుల శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వారిని చికిత్స కోసం శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

దోమ: తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులందరికీ అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజాపాలన పేరుతో అభయహస్తం దరఖాస్తులను అధికారులు, ప్రజాప్రతినిధులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆరు గ్యారంటీలు అమలుతీరును వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జనవరి 6వరకు దరఖాస్తులు స్వీకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సిలిండర్ల బదిలీ ప్రక్రియపై..

గత ప్రభుత్వాలు అర్హులైన లబ్ధిదారులకు బీపీఎల్, ఉజ్వల, దీపం పథకం కింద ఉచిత సిలిండర్లు అందజేసింది. అట్టి లబ్ధిదారులు పలువురు మృతి చెందారు. అలాంటి వారు దాదాపు 1300 మంది ఉన్నారని హెచ్‌పీ గ్యాస్ డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేకు చెప్పారు. మృతి చెందిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులను చేర్చేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీడీఓ జయరాం, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్యగౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖజాపాష, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య, హైకోర్టు న్యాయవాది ఆనందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ శాంతకుమార్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటుదాం



కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని త్వరలో జరగే లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థును భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటుదామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కేశంపేట రోడ్డులో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. 1885 డిసెంబర్ 28న పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. పార్టీకి 134 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీల సారథ్యంలో పార్టీ గ్రామ స్థాయిలోనూ బలంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... నాడు బ్రిటీష్ దొరలను.. నేడు గడీల దొరలను కాంగ్రెస్ గడగడలాడించిందన్నారు. ప్రజలకు స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, యాదయ్య యాదవ్, బాబర్‌ఖాన్, రఘు, ఇబ్రహీం, బస్వం, బాల్‌రాజ్‌గౌడ్, అప్పి, అందె మోహన్, పురుషోత్తం రెడ్డి, శ్రీధర్, ముబారక్, రమాదేవి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

ఒకరికి గాయాలు

మణికొండ: అతి వేగంతో ఓ కారు అదుపు తప్పి ఔటర్ సర్వీసు రోడ్డు నుంచి పక్కనే ఉన్న సైకిల్ ట్రాక్‌లోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం గచ్చిబౌలి నుంచి నార్సింగి వైపు వెళుతున్న కారు మైహోం అవతార్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న సైకిల్ ట్రాక్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని నార్సింగి పోలీసులు తెలిపారు.